జిల్లాలో నేడు

డయల్ యువర్ డీఎం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సమస్యలను తెలుసుకోవడానికి శుక్రవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ ఉష తెలిపారు. సమస్యలు, సూచనలు, సలహాలు ఇవ్వాలనుకునేవారు 9959226287 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

రక్తదాన శిబిరం

ఆమనగల్లు , నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ, కాంగ్రెస్ పార్టీ, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా కడ్తాల మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్‌రెడ్డి తెలిపారు.



కూలీల కొరత

చేతికొచ్చిన పత్తి, వరి పంటలు

వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తి, వరి పంటలు చేతికొచ్చాయి. వాటిని కోసేందుకు కూలీల కొరత ఏర్పడింది. స్థానికంగా మనుషులు దొరకక ఇతర ప్రాంతాల నుంచి రప్పించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నెల రోజులకు ముందుగానే కూలీలను బుక్ చేసుకుంటున్నారు. డిమాండ్ ఎక్కువ కావడంతో కూలి రేటు కూడా పెంచేశారు. దీనికితోడు ఆటో కిరాయిలు అదనంగా అవుతుండటంతో రైతులకు తడిసి మోపెడవుతుంది.

- కూలీల కోసం రైతుల వెతుకులాట
- కర్నూలు, మహారాష్ట్ర నుంచి వలస కూలీలు
- పనుల డిమాండ్‌తో పెరిగిన రేట్లు
- భారంగా మారిన వ్యవసాయం


చౌదరిగూడ మండలం తుమ్మలపల్లిలో వలస కూలీలు వేసుకున్న గుడిసెలు

రంగారెడ్డి అర్బన్/చౌదరిగూడ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత ఏడాది 1,27,786 ఎకరాల విస్తీర్ణంలో పత్తి పంట సాగు చేయగా, ఈ సారి 1,76,174 ఎకరాల్లో సాగు చేశారు. 48,388 ఎకరాల్లో సాగు పెరిగింది. 1,05,000 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పత్తి నాణ్యతను బట్టి మద్దతు ధర నిర్ణయించారు. క్వింటాలు పత్తికి (లాంగ్ స్టేపుల్) రూ.7521, మీడియం స్టేపుల్‌కు రూ.7121గా కేంద్ర ప్రభుత్వం ధర నిర్ణయించింది. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో 14 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే పొలాల్లో ఉన్న పత్తిని తీసేందుకు కూలీల కొరత ఏర్పడింది. పనులు ఎక్కువగా ఉండటంతో స్థానికంగా కూలీలు దొరకడం లేదు. దీంతో రైతులు సమీప గ్రామాల్లోకి వెళ్లి కూలీల కోసం వెతుకులాట ప్రారంభించారు. అక్కడ కూడా తీరిక లేదంటూ కూలీల నుంచి సమాధానం వస్తుండటంతో రైతులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. చివరకు పత్తిని తీయకుండా చేనులోనే వదిలేసే పరిస్థితి దాపురించింది. వరి, పత్తి పంటల కోతకు

మిగతా 8వ పేజీలో...



ప్రారంభమెప్పుడో?

- 'పట్నం' మార్కెట్ యార్డులో కొత్త షాపింగ్ కాంప్లెక్స్
- నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర..
- ఇంకా బిగించని విద్యుత్ మీటర్లు

8



ఘనంగా సదర్ ఉత్సవాలు

- మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్‌యాదవ్, కేఎస్ రత్నం హాజరు
- ఆకట్టుకున్న దున్నపోతు విన్యాసాలు

8


రెయిన్‌గేజ్ పరిసరాలను శుభ్రం చేయించిన రెవెన్యూ అధికారులు

రెయిన్‌గేజ్‌లో చెట్ల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండల కేంద్రంలోని రెయిన్‌గేజ్ చుట్టూ పెరిగిన చెట్లను అధికారులు తొలగించారు. రెయిన్‌గేజ్‌లో పెరిగిన కంప చెట్ల కారణంగా 'వర్షాన్ని కొలిచేదెలా?' అనే శీర్షికన ఈనెల 6న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనికి రెవెన్యూ అధికారులు స్పందించారు. బుధవారం సాయంత్రం రెయిన్‌గేజ్ పరిసరాల్లో ఉన్న చెట్లను, చెత్తాచెదారాన్ని తీసివేయించారు.

భక్తిశ్రద్ధలతో ఛట్ పూజ


పూజలో పాల్గొన్న ఉత్తర భారతీయులు

కొత్తూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో గురువారం రాత్రి ఛట్ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పెంజర్ల రోడ్డులోని బందోని మైసమ్మ ఆలయ ఆవరణలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో భారీ నీటితొట్టిని ఏర్పాటు చేశారు. బీహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రజలు కుటుంబసభ్యులతో తరలివచ్చి నీటిలోకి పూజలు చేశారు. సూర్యుడు అస్తమించిన తర్వాత, తిరిగి మరుసటి రోజు సూర్యుడు అస్తమించక ముందు వరకు ఉపవాస దీక్షతో ఈ పూజలు చేపడుతారు. అలాగే తిమ్మాపూర్ సమీపంలోని పాల్మాకుల చెరువు వద్ద కూడా ఛట్ పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్, ఎల్లనమోని రవీందర్‌యాదవ్, బి.దేవేందర్‌యాదవ్, పెంటనోళ్ల యాదగిరి, వెంకటేష్, బండి శ్రవణ్ పాల్గొన్నారు.

యాసంగి సాగు ప్రణాళిక సిద్ధం

కడ్తాల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.నర్సింహారావు తెలిపారు. సీజన్‌కు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కడ్తాల మండలంలో గురువారం డీఏవో పర్యటించారు. కడ్తాల్, ముద్విన్, రావిచెడ్ గ్రామాలలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. నిల్వలను, రికార్డులను, గోదాంలను పరిశీలించారు. రైతులకు ఈ-పాస్ ద్వారా మాత్రమే ఎరువులు విక్రయించాలని డీలర్లకు సూచించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించేటప్పుడు రైతులకు తప్పక రశీదు ఇవ్వాలని ఆదేశించారు. అధిక ధరలకు విక్రయాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. యాసంగిలో 1.23 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేసినట్లు చెప్పారు. రైతులు పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని డీఏఓ సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీలత, ఏఈవోలు అభినవ్‌రెడ్డి, వందన, డీలర్లు సుఖేందర్ రెడ్డి, వెంకటేశ్, జితేందర్ రెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్రాలకు ఏ రోజు వచ్చిన ధాన్యాన్ని ఆదేరోజు కొనుగోలు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 39 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ధాన్యం గ్రేడ్- ఏ రకానికి రూ. 2320, సాధారణ రకానికి రూ.2300, సన్న రకాలకు అదనంగా రూ.500 ధర చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేంద్రాల్లో అవసరమైన గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచాలని సూచించారు. అధికారులు రైస్ మిల్లర్లతో సమన్వయంతో పనిచేస్తూ కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. ధాన్యాన్ని రైస్ మిల్లులకు చేర్చేందుకు వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్, జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, డీఏఓ నర్సింహారావు, మార్కెటింగ్ శాఖ అధికారి రియాజొద్దీన్, డీసీవో సుధాకర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు ఆకాశ్

పరిగి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలోని న్యూబ్రిలియంట్ స్కూల్ విద్యార్థి వి.ఆకాశ్ రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపికయ్యారు. భువనగిరిలో జరిగిన అంతర్ జిల్లా ఎంపికల్లో ఆకాశ్ తన ప్రతిభను చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆకాశ్‌ను గురువారం పాఠశాల చైర్మన్ కె.హన్మంత్ ముదిరాజ్, ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌గౌడ్, పీఈటీ శ్రీనునాయక్ శాలువాతో ఘనంగా సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రహమ్మత్ అలీ

ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచాలి

» జిల్లా ఎన్నికల పరిశీలకుడు రహమ్మత్ అలీ

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నిలను స్వేచ్ఛగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా జాతీయ ఎన్నికల కమిషన్ గత అనుభవాలతో ఎప్పటికప్పుడు నూతన మార్గదర్శకాలను రూపొందిస్తున్నదని జిల్లా ఎన్నికల పరిశీలకులు రహమ్మత్ అలీ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఓటింగ్ శాతం తక్కువగా ఉందని, ఓటింగ్ శాతాన్ని పెంపొందించేందుకు అధికారులు, రాజకీయ నాయకులు కృషి చేయాలన్నారు. ఓటరు ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో భాగంగా సవరణలు, డెత్ కేసులను ఎప్పటికప్పుడు సవరించి ఓటరు జాబితాను అప్‌డేట్ చేయాలన్నారు. ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా ఉండాలన్నారు. ఓటరు జాబితాలో లింగ సమస్య అధికంగా ఉందన్నారు. సమావేశంలో కలెక్టర్ గౌతమ్, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, ఆర్డీఓ సైదులు, స్వీప్ అధికారి సాంబశివరావు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్థలం స్వాహా

రూ.కోట్ల విలువైన 315 చ.గజాలు మాయం
నకిలీ పత్రాలతో 59జీవో కింద రిజిస్ట్రేషన్
స్థానికుల ఫిర్యాదును పట్టించుకోని అధికారులు
గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఇష్టారాజ్యం

మేడ్చల్ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ భూములను కాపాడటానికి ఓ వైపు హైడ్రా కొరడా ఝులిపిస్తున్నా మరో వైపు భూ బకాసురులు ఏదో విధంగా ప్రభుత్వ స్థలాలను కాజేస్తున్నారు. ఉన్నది లేనట్టు.. లేనిది ఉన్నట్టుగా నకిలీ పత్రాలను సృష్టించి అధికారులను సైతం బురిడీ కొట్టిస్తున్నారు. మేడ్చల్ రెవెన్యూ పరిధిలోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన సర్వే నంబర్ 509లోని రూ.కోట్ల విలువైన 315 చదరపు గజాల స్థలాన్ని మింగేశారు. కుత్బుల్లాపూర్ మండలం దూలాపల్లికి చెందిన ఓ బీఆర్ఎస్ నాయకుడి కుమారుడు తప్పుడు ఇంటి నంబర్ వేయించి దర్జాగా తన పేరుపై 59 జీఓ కింద రిజిస్ట్రేషన్ చేయించుకొని షెడ్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ స్థలం దూలపల్లి వెళ్లే రోడ్డుకు ఆనుకుని ఉండటంతో గజానికి రూ.70వేలు పలుకుతుందని స్థానికులు అంటున్నారు.

నామినల్ చార్జీలు తీసుకొని

ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న నిరుపేదలకు నామినల్ చార్జీలు తీసుకొని 59 జీఓ కింద రిజిస్ట్రేషన్ చేసిచ్చే వీలును గత బీఆర్ఎస్ ప్రభుత్వం కల్పించింది. ఈ జీఓను అడ్డుపెట్టుకుని ప్రభుత్వ స్థలానికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 393లోని 109 గజాల స్థలంలో పంచాయతీ అనుమతితో ఇల్లు నిర్మించుకున్న సదరు ఇంటి యజమాని తన ఇంటికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 509లోని 315 గజాల ఎస్సీ కార్పొరేషన్ స్థలంలో రేకుల షెడ్డును ఏర్పాటు చేసుకున్నాడు. అనంతరం సర్వే నంబర్ 393లో 109 గజాల్లో నిర్మించుకున్న ఇంటి నంబర్ ఆధారంగా 59 జీవో ప్రకారం ఆ స్థలాన్ని గతేడాది సెప్టెంబరు 23న రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు.


ఎస్సీ కార్పొరేషన్ స్థలంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్

డీటీ నివేదిక ఆధారంగానే..

59 జీఓ కింద రిజిస్ట్రేషన్‌కోసం దరఖాస్తు చేసుకున్న అనంతరం స్థలానికి సంబంధించి పూర్తి విచారణ జరపాల్సిన రెవెన్యూ అధికారులు ఎలాంటి విచారణ జరపకుండానే సదరు వ్యక్తికి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానిక డిప్యూటీ తహసీల్దార్ దిలీప్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసినట్లు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి.

అధికారులను తప్పుదోవ పట్టించారు


సర్వే నంబర్ 509లోని ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన 315 చదరపు గజాల స్థలాన్ని 59 జీఓ కింద రిజిస్ట్రేషన్ చేసిన విషయం పట్ల ఫిర్యాదులు వచ్చాయి. కాగా, సదరు వ్యక్తి తప్పుడు ఆధారాలు చూపినట్టు గుర్తించి ఉన్నత అధికారులకు నివేదిక పంపించాం. అధికారులను తప్పుదోవ పట్టించి రిజిస్ట్రేషన్ చేకుంటే రిజిస్ట్రేషన్ రద్దు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటాం

-శైలజ, మేడ్చల్ తహసీల్దార్

రెవెన్యూ అధికారుల తప్పిదమే


రెవెన్యూ అధికారుల తప్పిదం వల్ల రూ.కోటి విలువ చేసే స్థలం నేడు ప్రైవేటు వ్యక్తి పాలైంది. పంచాయతీ నుంచి అనుమతి పొందిన ఇంటి నంబర్‌ను సర్వే నంబర్‌గా మార్చి అధికారులను తప్పుతోవ పట్టించి 59 జీవో కింద రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. స్థానికులు ఎంత చెప్పినా తహసీల్దార్ కార్యాలయం వారు పట్టించుకోదు.

-బేరి శంకర్, గుండ్లపోచంపల్లి

విచారణ జరిపాలి


59 జీఓ కింద చేసిన రిజిస్ట్రేషన్‌పై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలి. ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన స్థలం అని తెలిసినప్పటికీ అధికారులు పట్టించుకో లేదు. ఈ విషయమై తహసీల్దార్ కార్యాలయానికి చెప్పులు అరిగేదాక తిరిగి, విసిగెత్తిపోయాం. అయిన అధికారులు పట్టించుకో లేదు.

-లక్ష్మణ్, గుండ్లపోచంపల్లి

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

వికారాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తామని వికారాబాద్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మంజుల రమేశ్ అన్నారు. పలు వార్డుల్లో గురువారం వాటర్ సప్లయ్ పైప్‌లైన్, సింటెక్స్ ట్యాంకుల ఏర్పాటు పనులకు, యుజీడీ పైప్‌లైన్ పనులు, మ్యాన్ హోల్స్ ఏర్పాటు తదితర కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, రమేష్, కిరణ్‌పటేల్, ప్రభావతి, రాకేష్ రెడ్డి తదితరులున్నారు.



భక్తిశ్రద్ధలతో భూవరాహ హోమం

బొంరాస్‌పేట్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారాముల ఆలయభూమి శుద్ధి కార్యక్రమం సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వరాహ, అఘోర హోమం తదితర పూజలు నిర్వహించారు. పురోహితులు జోషి సత్యనారాయణ శర్మ తదితరులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మన్ జయకృష్ణ, వెంకట్రాములు గౌడ్, నర్సింహులుగౌడ్, వీరేశం, సంతోష్, విజయ్‌వర్ధన్ నర్సింహులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

» జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి డీబీ శీతల్


సమావేశంలో మాట్లాడుతున్న డీబీ శీతల్

వికారాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో కాబోయే డాక్టర్లు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి డి.బి శీతల్ అన్నారు. గురువారం వికారాబాద్ మెడికల్ కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మీ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని చదవిస్తున్నారు. విధిగా చదువు మీద శ్రద్ధ పెట్టాలి. ర్యాగింగ్ అనే పదం మీ మధ్య లేకుండా మీ ప్రొఫెసర్లు చెప్పే సూచనలను పాటిస్తూ మంచి డాక్టర్లుగా ఎదగాలి. పేద వారికి సేవ చేసే విధంగా ఆలోచన కలిగి ఉండాలి. ర్యాగింగ్ పేరుతో లేనిపోని పనులు చేయకుండా మీకూ, మీ కుటుంబానికి చెడ్డ పేరు రాకుండా జాగ్రత్త వహించాలి' అని ఆమె సూచించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాదులు వెంకటేశ్, రాము, న్యాయవాది ఆవుటి రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

పరిగి: అనాథ చిన్నారుల విద్య, ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి డీబీ శీతల్ హెచ్చరించారు. గురువారం పరిగిలోని బాలసదనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలసదనంలోని చిన్నారులతో స్వయంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్టాక్ రిజిస్టర్లు చూపలేకపోవడంతో అసంతృప్తిని వ్యక్తం చేశారు. మరోసారి విజిట్ చేస్తానని, అప్పటిలోపు అన్ని ఉండేలా చూడాలని సూచించారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం పట్ల ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలికల పట్ల బాధ్యతగా వ్యవహరించి వారిని ప్రయోజకులుగా చేసే విధంగా పని చేయాలని సూచించారు.

ఎల్ఐసీకి స్థలం కేటాయిస్తాం


సమావేశంలో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఏజెంట్లు

తాండూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ కార్యాలయ నిర్మాణానికి స్థలం కేటాయిస్తామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు వీరబ్రహ్మేంద్రస్వామి గుట్టపై జరిగిన ఎల్ఐసీ ఏజెంట్ల జనరల్ బాడీ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎల్ఐసీ ఏజెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. ప్రతీ ఒక్కరికి పాలసీ తప్పనిసరి అని అన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్వప్న మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకూ ఎల్ఐసీ పాలసీ చేయించామని తెలిపారు. ఎల్ఐసీ ఏజెంట్ల ఆల్ ఇండియా అడ్వైజర్ కమిటీ ఛైర్మన్ సింగారపు శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాలసీదారులు ఎక్కువ లాభాలు లేకుండానే సేవ చేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ ధారాసింగ్, ఎల్ఐసీ తాండూరు నియోజకవర్గ అధ్యక్షుడు వడ్ల శ్రీనివాస్, ఎల్ఐసీ ఏజెంట్ల ప్రతినిధులు బిచ్చప్ప, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దేముల్: మండలంలోని బుద్దారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు లొంక నర్సింహులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరాన్ని గురువారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధారాసింగ్, ఉత్తమ్‌చంద్, నర్సింహులు, ఉప్పరి మల్లేశం పాల్గొన్నారు.

దళారులను ఆశ్రయించి మోసపోవద్దు

» రైతులకు అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచన


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కులకచర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. గురువారం కులకచర్లలో ఆర్డీవో వాసుచంద్రతో కలిసి సెర్ప్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన రైతులు, కేంద్రం నిర్వాహకులతో మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ మద్దతు ధర కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ ఉంచకుండా మిల్లర్లకు తరలించాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. వారం రోజుల్లో డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌వో మోహన్‌బాబు, సొసైటీ ఛైర్మన్ కనకం మొగులయ్య, తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీవో రామకృష్ణ, ఏపీఎం శోభ, ఎంపీవో భాస్కర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు, నాయకులు కుమ్మరి స్వామి, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

అనంతరం కులకచర్లలో కొనసాగుతున్న కులగణనను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే పూర్తయ్యే వరకు కచ్చితమైన కుటుంబాల సంఖ్య ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారి వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని సూచించారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, డీఎస్‌వో మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

యజమాని ఇచ్చిన వివరాలనే పొందుపర్చాలి

» ఎన్యూమరేటర్లతో కలెక్టర్ ప్రతీక్ జైన్
» చెంచుపల్లిలో సమగ్ర సర్వే పరిశీలన


కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న గ్రామస్తులు

పూడూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇంటి యజమాని ఇచ్చిన వివరాలు మాత్రమే సమగ్ర సర్వే ప్రొఫార్మాలో పొందుపర్చాలని ఎన్యూమరేటర్లకు కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. గురువారం మండల పరిధిలోని చెంచుపల్లి గ్రామంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు సమగ్ర ఇంటింటి సర్వే ఉపయోగ పడుతుందన్నారు. గ్రామాల్లో సర్వే నిమిత్తం అధికారులు సందర్శించినప్పుడు పూర్తి సమాచారాన్ని అందించి అధికారులకు సహకరించాలని కోరారు. తప్పులు లేకుండా, ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా చెంచుపల్లిలోని భూముల సమస్యలను క్షుణ్ణంగా అవగాహన కల్పించుకుని పరిష్కారం దిశగా కృషి చేయాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాసుపుస్తకాల సమస్యలు, ఇతర ఎలాంటి భూమి సమస్యలు ఉన్నా రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో విద్యుత్ తీగలు పూర్తిగా కిందికి వేలాడుతున్నాయని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే విద్యుత్ తీగలు సరి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ గ్రామంలోని అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించి పిల్లలతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందజేశారు. కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, తహసీల్దార్ భరత్, ఎంపీడీవో పాండు, అంగన్‌వాడీ టీచర్ విజయకుమారి తదితరులున్నారు.


మొక్కజొన్న విత్తనాలు అందిస్తున్న శాస్త్రవేతలు

మొక్కజొన్నకు బంగారు భవిష్యత్తు

» లూథియానా వ్యవసాయ శాస్త్రవేత ఎస్.ఎల్ జాట్
» ట్రైబల్ స్కీంలో ఉచితంగా విత్తనాల పంపిణీ

కేశంపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్నకు బంగారు భవిష్యత్తు ఉందని రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని లూథియానా వ్యవసాయ శాస్త్రవేత ఎస్.ఎల్ జాట్ సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, మొక్కజొన్న పరిశోధన కేంద్రం, జాతీయ మొక్కజొన్న పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని దేవునిగుడి తండాలో షెడ్యూల్ తెగల ఉపప్రణాళిక పథకంలో భాగంగా మొక్కజొన్న పంట సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత ఎస్.ఎల్. జాట్ మాట్లాడుతూ పౌల్ట్రీలో మొక్కజొన్న ప్రధాన భూమిక నిర్వహిస్తుందని తెలిపారు. పౌల్ట్రీ అభివృద్ధికి ఉపయోగపడుతన్న మొక్కజొన్నకు బంగారు భవిత ఉందని వివరించారు. బీర్ల తయారీతో పాటు, పెట్రోల్‌లో కలిసే ఇథనాల్ తయరీలో ముడి సరుకుగా మొక్కజొన్నను ఉపయోగించే అంశాన్ని ప్రభుత్వం ఆలోచిస్తుందని వివరించారు. రైతులు కొంత ముందు చూపుతో మొక్కజొన్న వైపు మళ్లితే అధిక దిగుబడితో పాటు పెద్ద ఎత్తున లాభాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వం ట్రైబల్ స్కీం కింద రైతులకు డీహెచ్‌ఎం 117 రకం విత్తనాలను ఎకరాకు 8 కేజీలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో డాక్టర్ యం.వి. నాగేశ్, డాక్టర్ ఎన్. సునీల్, డాక్టర్ బి. మల్లయ్య, డాక్టర్ లక్ష్మి, సౌజన్య, వాణిశ్రీ, వై.ఎస్. పరమేశ్వరి, ఏఈవోలు రాజేశ్వరి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి

తాండూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ చట్టం 2023న సవరించి షరతులను తొలగించి వెంటనే అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. గురువారం తాండూరులో జరిగిన జిల్లా మహిళా సమాఖ్య మహాసభలో ఆమె మాట్లాడారు. నవంబర్ 23న మహిళా రిజర్వేషన్లపై హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్ర మహిళా సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మహిళా ఉద్యమానికి తాండూరు ప్రాంతం పుట్టినిల్లన్నారు. ఎన్నో హక్కులను ఈ ప్రాంత మహిళలు పోరాటాల ద్వారా సాధించారని గుర్తు చేశారు. మహిళలకు పెన్షన్లు రుణాలు రేషన్ కార్డుల పునరుద్ధరణ కోసం కృషి చేద్దామన్నారు. గతంలో ఈ సమస్యలను పోరాటం చేసి సాధించుకున్నారని గుర్తు చేశారు. మహిళలు సంఘటితంగా పోరాటాలు చేయాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ మహిళలను చైతన్యపరిచి పోరాటాలు నేర్పితే నేటి రాజకీయ పరిస్థితులు చౌక కూలీలుగా మార్చారని ఆరోపించారు. ఈ సమావేశం నసీమా బేగం అధ్యక్షతన జరుగగా ఆమెను జిల్లా అధ్యక్షురాలుగా ఎనుకున్నారు. కార్యదర్శిగా జగదాంబ , ఉపాధ్యక్షులు చంద్రమ్మ, పుణ్యమ్మ, సహాయ కార్యదర్శులుగా పుష్ప, సంతోష్, పద్మలను ఎనుకున్నారు.



కొండల్ రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న మండ్లీ రాములు

రక్తదానంపై అపోహలు వీడాలి

ఆమనగల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రక్తదానంపై ప్రజలు అపోహలు వీడాలని సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల కొండల్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో నేడు(శుక్రవారం) సీఎం జన్మదినాన్ని పురస్కరించుకొని ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. శిబిరానికి సంబంధించి ఆహ్వానపత్రికను గురువారం రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లీ రాములు, పట్టణాధ్యక్షుడు మానయ్య, జిల్లా నాయకుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి కొండల్‌రెడ్డికి అందజేశారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీగార్డెన్‌లో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు రాములు చెప్పారు. లింగంపల్లి ఆనంద్, కాలె మల్లయ్య, కొప్పు రాఘవేందర్, అంజి, కృష్ణ, లక్ష్మయ్య, కుమార్‌గౌడ్, తదితరులున్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్తులు జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేశారు. గురువారం ఏడో రోజు గ్రామ నాయకులు దీక్షలో కూర్చున్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు నర్సింహ, అనిల్, చెన్నయ్య, తదితరులున్నారు.

కులవృత్తిదారుల సంక్షేమానికి పెద్దపీట



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, బీచ్యనాయక్, వెంకటేశ్

కడ్తాల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల బాలాజీ తాపీ మేస్త్రీ సంఘం నూతన కార్యవర్గానికి గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ సమక్షంలో తాపీ మేస్త్రీ సంఘం అధ్యక్షుడు కాలె శ్రీరాములు, ఉపాధ్యక్షులు సిద్దిగారి మహేశ్, జంగయ్య, మల్లేశ్, రాములు, నర్సింహ, కృష్ణ, సంఘం సభ్యులను సత్కరించి అభినందించారు. సభ్యుల కోరిక మేరకు ఎమ్మెల్యే నారాయణ రెడ్డి సహకారంతో కడ్తాలలో కమ్యూనిటీహాల్, బీమా సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కో-ఆప్షన్ మండల మాజీ సభ్యుడు జహంగీర్‌బాబా, జిల్లా నాయకులు మాలే మల్లేశ్‌గౌడ్, నాయకులు మంకి శ్రీను, రమేశ్, వేణుకుమార్ తదితరులు ఉన్నారు.

'మాజీ ఎమ్మెల్యే అంజయ్య చౌదరిగూడకు ఏం చేశారు?'

చౌదరిగూడ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మీ హయాంలోనే జిల్లేడ్ చౌదరిగూడను మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు కానీ, ఏ కార్యాలయానికి సొంత భవనం మంజూరు చేశారో చెప్పాలని, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడాన్ని నిరసిస్తున్నామని కాంగ్రెస్ జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ప్రశ్నించారు. గురువారం చౌదరిగూడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బుధవారం చౌదరిగూడలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవానికి వచ్చి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడాన్ని కాంగ్రెస్ నాయకులు ఖండించారు. మండల అభివృద్ధికి ఎమ్మెల్యే శంకర్ కృషి చేస్తున్నారని అన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభమెప్పుడో?

- వృథాగా 'పట్నం' మార్కెట్ యార్డులో నూతనంగా నిర్మించిన దుకాణ సముదాయం
- నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర.. విద్యుత్ మీటర్ల బిగింపులో జాప్యం



మార్కెట్ యార్డులో నిర్మించిన దుకాణ సముదాయం

ఇబ్రహీంపట్నం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో కొత్తగా నిర్మాణం చేసిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి ఏడాదిన్నర కావస్తున్నా.. ప్రారంభానికి నోచుకోవడం లేదు. దాంతో వ్యాపారులు, ప్రజలు ఒప్పుడు ఓపెనింగ్ చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రధాన రహదారిపై ఉన్న మార్కెట్ యార్డులో వ్యాపారానికి మంచి డిమాండ్ ఉంది. రూ.1.20 కోట్ల వ్యయంతో 17 దుకాణాలతో కాంప్లెక్స్ నిర్మాణం చేశారు. కాగా, ఈ మడిగె(దుకాణాలు)ల్లో విద్యుత్ మీటర్లు బిగించాల్సి ఉంది. దీనికిగాను డీడీలు కట్టినా.. ఇంతవరకు మీటర్లు బిగించలేకపోయారు. అంతేకాకుండా షాపింగ్ కాంప్లెక్స్ ముందు ఉన్న సీసీ రోడ్డు మధ్యలో రెండు విద్యుత్ పోల్స్ షిఫ్టింగ్ చేయాల్సి ఉంది. ఈ పనులు పూర్తయితేగానీ ఇంజనీరింగ్ విభాగం కాంప్లెక్స్‌ను మార్కెట్ యార్డుకు అప్పగించనుంది. అప్పుడుగాని షాపింగ్ కాంప్లెక్స్ మడిగెలు వేలం వేస్తే మార్కెట్‌కు నెలకు రూ.రెండు లక్షలపైనే ఆదాయం సమకూరుతుంది. నిర్మాణం పూర్తయి 18 నెలలైనా ఇప్పటి వరకు అందుబాటులోకి రాకపోవడంపై వ్యాపారులు, ప్రజలు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఈ నెలాఖరులోగా అందుబాటులోకి తెస్తాం



ఈ నెలాఖరులోగా నూతనంగా నిర్మించిన మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తెచ్చి వేలం పద్దతిన మడిగెలు(దుకాణాలు) కేటాయించాలని నిర్ణయించాం. రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ పోల్స్ షిఫ్టింగ్, మడిగెల్లో మీటర్లు బిగించాల్సి ఉంది. ఇప్పటికే కొత్తగా మీటర్ల బిగింపునకు డీడీలు కూడా కట్టేశాం.

- ఎన్.సంతోష్‌కుమార్, మార్కెట్ కమిటీ కార్యదర్శి

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి

- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని, వారికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని నర్సప్పగూడ గ్రామంలోని అక్కమ్మ చెరువులో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఆయన చేపపిల్లలను వదిలారు. మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, పార్టీ మండలాధ్యక్షుడు నర్సింహులు, నర్సప్పగూడ మాజీ సర్పంచ్ కృష్ణయాదవ్, మాజీ ఎంపీటీసీలు కృష్ణ, కుమారస్వామిగౌడ్, మత్స్యశాఖ సంఘం సభ్యులు, ఆయా శాఖల అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

కొత్తూర్ : ప్రతీఒక్కరు అధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని వైఎం తండాలో నూతనంగా నిర్మిస్తున్న లింగబసవేశ్వరస్వామి దేవాలయ భూమిపూజలో ఎమ్మెల్యే పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మికతతో ప్రతి ఇంట్లో ప్రశాంతత నెలకొంటుందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, నాయకులు అంబటి ప్రభాకర్, శేఖర్‌రెడ్డి, కొమ్ము కృష్ణ, మల్లేష్, నిర్వాహకులు గోవింద్‌నాయక్, రాములునాయక్, రెడ్యానాయక్, వెంకట్‌నాయక్, చత్రునాయక్, బుట్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహావిష్కరణ పోస్టర్ ఆవిష్కరణ

షాద్‌నగర్ అర్బన్ : ఫరూఖ్‌నగర్ ఆజమల్లిఖాన్ తోటలో పునఃనిర్మాణం చేపట్టిన శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయాన్ని ఈనెల 20న ప్రారంభించబోతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అలాగే శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహావిష్కరణ కూడా ఉంటుందని తెలిపారు. ఈమేరకు గురువారం ఎమ్మెల్యే శంకర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామస్థులు గంధం శేఖర్, పిల్లి శేఖర్, జమృద్‌ఖాన్, వీరేష్, శివయ్య, బీరప్ప, శ్రీశైలం, లక్ష్మీ నర్సింహ, మేడిగ వీరేశం తదితరులు పాల్గొన్నారు.



విరాళం ఇస్తున్న కానుగు అంతయ్య

ఆలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్ అర్బన్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలోని నిర్మిస్తున్న అంజనేయస్వామి ఆలయానికి షాద్‌నగర్ పట్టణ 13 వార్డు కౌన్సిలర్ కానుగు అంతయ్య రూ.25వేల విరాళం ఇచ్చారు. ఈమేరకు అంతయ్యను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, గ్రామస్తులు కక్కునూరి వెంకటేష్‌గుప్తా, పిల్లి యాదయ్య, నరహరి, మోహన్, రఘులు అభినందించారు.

మోడల్ హౌజ్ నిర్మాణానికి స్థలం ఎంపిక



పిచ్చిమొక్కలు, చెట్లను తొలగింపజేస్తున్న ఎంపీడీవో మాధురి

ఆమనగల్లు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించే ఇందిరమ్మ మోడల్ హౌజ్ నిర్మాణానికి గురువారం ఎంపీడీవో మాధురి స్థలాన్ని ఎంపిక చేశారు. మండల పరిషత్ కార్యాలయాన్ని అనుసరించి 400 గజాల స్థలాన్ని పరిశీలించారు. మున్సిపాలిటీ సహకారంతో గుర్తించిన స్థలంలో పిచ్చిమొక్కలను, చెట్లను తొలగించి శుభ్రం చేయించారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి

- వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం మేరకు దివ్యాంగులకు నెల నెలా ఆరువేల పింఛన్ ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి అధ్యక్షతన గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఆవరణలో జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. అడివయ్య పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు ఆరువేల పింఛన్ ఇస్తామన్న వాగ్దానాన్ని నేటికీ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చినమాట ప్రకారం ఆరువేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సమగ్ర సర్వేకు ప్రజలంతా సహకరించాలి



శంషాబాద్‌లో సర్వేను పరిశీస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి

కడ్తాల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): అసమానతలు, వివక్ష, పేదరికాన్ని రూపు మాపి, అంతరాలను తొలగించి సామాజికవర్గాల వారీగా అన్ని రంగాల్లో సమాన వాటా పంచడానికి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణన, సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంత సహకరించాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో గురువారం సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ స్టిక్కర్లు వేశారు. మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, మండలమాజీ కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, మంకిశ్రీను, భరత్‌కుమార్, చెన్నయ్య పాల్గొన్నారు.



కందుకూరు : లేమూరులో సమగ్ర సర్వేను పరిశీలిస్తున్న సీఈవో కృష్ణారెడ్డి

ఆమనగల్లు : ఆమనగల్లు మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. ఎన్యుమరేటర్లు ఇళ్ల వద్దకు వెళ్లి స్టిక్కర్లు అంటించారు. కాంగ్రెస్ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు. యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అలీం, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, సోషల్‌మీడియా కన్వీనర్ నాజర్‌లున్నారు.

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో జరుగుతున్న కుటుంబ సర్వేను మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి పరిశీలించారు. కౌన్సిలర్ సంజయ్‌యాదవ్, మాజీ వార్డు సభ్యులు శ్రీధర్‌యాదవ్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్ : సిక్కర్లు అంటిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

కందుకూరు : కులగణనకు ప్రతీ ఒక్కరు సహకరించి వివరాలు తెలియజేయాలని జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి కోరారు. గురువారం మండలంలోని కొత్తూరు, లేమూరు, సరస్వతీగూడలో సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దార్ కె.గోపాల్, ఎంపీవో గీత, ఆర్‌ఐలు యాదయ్య, శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

యాచారం : సర్వే రికార్డులలో తప్పులు లేకుండా నమోదు చేయాలని మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి తెలిపారు. యాచారం, చౌదర్‌పల్లిలో ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లను అతికిస్తున్న తీరును పరిశీలించారు. ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షణాధికారి శైలజ, పంచాయతీ కార్యదర్శి తిరుపతి తదితరులున్నారు.

క్రైం కార్నర్

పెద్దకొడుకుతో కలిసి చిన్న కుమారుడి హత్య

- మాడ్గుల మండలం గుడితండాలో ఓ తండ్రి ఘాతుకం
- హత్యానంతరం పొలంలో పాతిపెట్టిన తండ్రీకుమారులు
- ఆస్తి పంపకాలే కారణం.. ఆలస్యంగా వెలుగులోకి..

మాడ్గుల, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్నకుమారుడిని పెద్దకొడుకుతో కలిసి దారుణంగా హతమార్చిన ఓ తండ్రి ఉదంతం మండల పరిధిలోని గుడితండాలో ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ జగదీష్ కథనం ప్రకారం.. గుడితండాకు చెందిన రాత్లావత్ సురేష్(28) హైదరాబాద్‌లోని బాల్‌లింగంపల్లిలో ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల దసరాకు సందర్భంగా గుడితండాకు అక్టోబరు 11న సురేష్ వచ్చి అందరితో కలసిమెలసి పండుగ జరుపుకున్నాడు. 13వ తేదీన తండ్రి లక్ష్మణ్, సోదరుడు నరేష్‌లు ఆస్తి పంపకాల విషయంలో గొడవపడ్డారు. ఈక్రమంలో సురేష్‌కు మద్యం తాగించి తండ్రీకుమారులు కలిసి మాంసం కోసే కత్తితో నరికి చంపారు. అనంతరం ఊరి పరిసరాల్లోని పొలంలో పూడ్చిపెట్టారు. కాగా, ఆస్తి పంపకాలే హత్యకు గల కారణమని, సురేష్‌ను హతమార్చడానికి ముందస్తుగానే పొలంలో గొయ్యి తీసి ఉంచినట్లు గ్రామస్తులు తెలిపారు. కాగా, హత్యానంతరం మృతదేహాన్ని ఆటోలో తీసుకెళ్లి పాతిపెట్టిన అనంతరం తండ్రీకుమారులు హైదరాబాద్‌కు వెళ్లిపోయారని సీఐ తెలిపారు. అయితే, ఇటీవల నరేష్ తాగిన మైకంలో నోరుజారి తన తమ్ముడిని చంపి పొలంలో పాతిపెట్టామని తెలిసినవారితో చెప్పాడు. అనంతరం నేరుగా తండ్రీకుమారులు కలిసి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. పూర్తి వివరాలు సేకరించిన పోలీసులు గుడితండాకు వెళ్లి ఘటన స్థలాన్ని పరిశీలించారు. గోతిలోంచి సురేష్ శవాన్ని బయటికి తీసి తహసీల్దార్ వినయ్ సాగర్, సీఐ జగదీష్, డాక్టర్ జె.విష్ణులు పంచనామా నిర్వహించారు. డాక్టర్ శవపరీక్ష నిర్వహించారు. ఈమేరకు రాత్లావత్ లక్ష్మణ్, నరేష్‌లపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



విఠలయ్య (ఫైల్)

శంషాబాద్ రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన శంషాబాద్ మండలంలోని ఘన్సిమియాగూడ గ్రామంలో జరిగింది. ఎస్సై నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. ఘన్సిమియాగూడకు చెందిన గుగ్గిళ్ల విఠలయ్య(65)కు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో అప్పుడప్పుడూ ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడు. ఈక్రమంలో గత నెల 19న విఠలయ్య ఇంటి నుంచి వెళ్లిపోయి ఇప్పటి వరకు తిరిగి రాలేదు. ఆచూకీ కోసం తెలిసినవారు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. విఠలయ్య భార్య భారతమ్మ గురువారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో భర్త ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

శంకర్‌పల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని గండిపేట ఎంజీఐటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. కళాశాల విద్యార్థులు మహారాజ్‌పేట్ గ్రామంలో ఎన్ఎస్ఎస్ క్యాంపు కార్యక్రమంలో భాగంగా గురువారం సైబర్ నేరాలు, మహిళా సాధికారికతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ బాల్‌రెడ్డి, అధ్యాపకులు, మాజీ సర్పంచ్ నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

షాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మానవ అక్రమ రవాణాను అరికడదామని ఎంపీడీవో అపర్ణ, ఎంఈవో లక్ష్మణ్, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు మానవ అక్రమ రవాణాపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. స్వచ్ఛంద సంస్థ స్టేట్ కోఆర్డినేటర్ సురేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

యాచారం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలని డీఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆలంపల్లి జంగయ్య అన్నారు. గురువారం మండలం మాల్‌లో డ్రగ్స్, గంజాయి నిర్మూలనపై ఎస్ఎఫ్ఐ విద్యార్థులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వాడి జీవితాలను పాడుచేసుకోరాదని కోరారు. కష్టపడి చదివి ఉద్యోగాలు పొంది సాటివారికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి తరంగ్, మాల్ సెంటర్ నాయకులు విప్లవ్‌కుమార్, రమేష్, వెంకటేష్ తదితరులున్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కడ్తాల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్లు పీఏసీఎస్ చైర్మన్ గంప వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని శివాలయంలో గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 60 రోజుల పాటు అయ్యప్ప స్వాములకు నిర్వహించే నిత్యాన్న ప్రసాద (బిక్ష) కార్యక్రమాన్ని ప్రముఖ గురుస్వామి చంద్రమోహన్ నాయర్‌తో కలిసి వెంకటేశ్ ప్రారంభించారు. ఆలయంలో అయ్యప్ప పూజలు నిర్వహించారు. ఎనిమిదేళ్లుగా అయ్యప్ప, అంజనేయ, శివ స్వాములకు నిత్యాన్నప్రసాదాన్ని సమకూరుస్తున్న వెంకటేశ్‌ను చంద్రమోహన్ నాయర్, గురుస్వాములు అభినందించారు.

హక్కుల పట్ల అవగాహన పెంచుకోవాలి

శంకర్‌పల్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ హక్కుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఇక్ఫాయ్ కళాశాల వైస్ చాన్సలర్ ఎల్ఎస్ గణేష్ తెలిపారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ కళాశాలలో గురువారం సాయంత్రం షీటీమ్, మోకిల, శంకర్‌పల్లి పోలీసుల ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై కళాబృందంచే విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మహిళలపై లైంగిక దాడులు, వేధింపులు, గృహ హింస, అత్యాచారాలు, దాడులు రోజురోజుకూ పెరిగిపోతుండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు చట్టాల పట్ల పూర్తి అవగాహన పెంచుకుని ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. షీటీమ్‌కు ఫిర్యాదు చేసినవారి వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు. సైబర్‌నేరాల పట్ల సైతం అవగాహన పెంచుకోవాలని వివరించారు. ఇక్ఫాయ్ రిజిస్ట్రార్ విజయలక్ష్మి, డైరెక్టర్ రవిశేఖరరాజు, జాయింట్ రిజిస్ట్రార్ జయంతిరెడ్డి, మధుసూధన్, షీటీమ్ అధికారి సునీత, మోకిల ఎస్సై కోటేశ్వర్‌రావు తదితరులున్నారు.

కూలీల కొరత

(5వ పేజీ తరువాయి)

కూలీల కొరత ఉండటంతో రైతులకు వ్యవసాయం పెనుభారంగా మారింది. రానున్న కాలంలో కూలీల కొరత ఇలానే ఉంటే వ్యవసాయం చేయడం కష్టమేనని పలువురు రైతులు వాపోతున్నారు.

కర్నూలు, మహారాష్ట్ర నుంచి కూలీలు..

పంటను కోయకుండా వదిలేయలేక మహారాష్ట్ర, కర్నూలు జిల్లాలోని ఆదోని, ఎమిగనూరు ప్రాంతాల నుంచి కూలీలను రప్పిస్తున్నారు. స్థానికంగా గుడిసెలు వేసుకుని కూలీల కుటుంబాలు నివాసముంటున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పత్తి తీస్తున్నారు. ఒక్కో కూలీ కుటుంబం 2క్వింటాల వరకు పత్తిని తీస్తున్నారు. కిలో పత్తికి 10 రూపాయల చొప్పున 2 క్వింటాళ్ల తీసిన కూలీలకు ఒక్కరోజు కూలిగా రూ.2 వేలు సంపాదిస్తున్నారు.

పెరిగిన కూలి

పత్తి తీతకు కూలి పెరిగింది. కిలో పత్తి ఏరితే రూ.9 చెల్లించేవారు. ఈ ఏడాది ఆ ధర రూ.10కి పెంచారు. కొన్ని పరిస్థితుల్లో కూలీలు దొరకకపోతే రూ.11 కూడా ఇస్తున్నారు. కిలో పత్తి తీసేందుకు 12 రూపాయలు ఇవ్వాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం మొదటి పత్తి తీత పనులు మొదలయ్యాయి.

యంత్రాలు లేక వరికోతకు ఇబ్బందులు

వరి కోతలకు ఇప్పుడు ఎక్కువగా యంత్రాలపైనే ఆధారపడుతున్నారు. అయితే చాలాప్రాంతాల్లో ఒకేసారి కోతలు షురూ కావడంతో కొన్ని గ్రామాల్లో యంత్రాలు అందుబాటులో ఉండటం లేదు. దీంతో మిషన్లు దొరకని ప్రాంతాల్లో వరి కోతలకు రైతులు కూలీలను వినియోగిస్తున్నారు. రోజు కూలీ రూ.500 చొప్పున ఇస్తే ఎకరానికి పది మంది కూలీలకు రూ.5వేల ఖర్చు అవుతుంది.

కాటన్ మిల్లులో పనిచేయడానికి వచ్చా



మాది మహారాష్ట్ర, పత్తి సీజన్ కాబట్టి పత్తి తీసేందుకు మహారాష్ట్ర నుంచి చాలామంది కూలీలు వచ్చారు. అయితే, నేను వనంపల్లిలోని కాటన్ మిల్లులో పనిచేసేందుకు వచ్చాను. కాగా, నేను రేపటి నుంచి పనికి వెళ్తాను.

- మనీష్, మహారాష్ట్ర, చంద్రపూర్ జిల్లా, మాల్ మండలం

కూలీల కోసం ఎదురు చూస్తున్న



30 ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. అందులో 15 ఎకరాల పత్తి, 15 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. ఎకరం పత్తికి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టాను. పత్తి తీసేందుకు రెడీగా ఉంది. కూలీల కోసం ఎదురు చూస్తున్న. కర్నూలు వెళ్లి కూలీలను బుక్ చేసుకున్నాను. మరో రెండు రోజుల్లో వారు వస్తారు.

- దయ్యాల శ్రీశైలం, పత్తి రైతు కొందుర్గు

సంక్షిప్తంగా

- **తలకొండపల్లి** : ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో గురువారం శ్రీనివాస్‌యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ సీజన్ ప్రారంభమైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.
- **యాచారం** : మాల్‌కు చెందిన శోభ ఇటీవల మరణించింది. వారిది కడు పేద కుటుంబం కావడంతో ఆమె భర్త మున్నయ్యకు గురువారం కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి భట్టు శ్రీనివాస్ రూ.5వేల నగదు అందించారు. దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలన్నారు.
- **శంషాబాద్** : శంషాబాద్ మండలానికి చెందిన ఎం.బాలయ్య బీసీ హక్కుల సాధన సమితి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈమేరకు బాలయ్యను గురువారం సీపీఐ నాయకులు ఎన్.గిరి, ఆర్.యాదగిరి ఏఐటీయూసీ నాయకుడు ప్రభులు సన్మానించారు.
- **తలకొండపల్లి** : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేల వేతనం చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వై. స్వప్న డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం కావొస్తున్నా నేటికీ ఇచ్చిన హామీని నెరవేర్చలేదన్నారు. మండల కేంద్రంలో కార్మికుల సంఘం సమావేశం గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించగా స్వప్న హాజరయ్యారు. సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి సమావేశంలో మాట్లాడారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు



ఉత్సవాల్లో అంజయ్య యాదవ్, జైపాల్‌యాదవ్ తదితరులు

మొయినాబాద్ నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) సదర్ ఉత్సవాలను మొయినాబాద్‌లో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో మండలంలోని యాదవులు నిర్వహించిన ఉత్సవాలకు షాద్‌నగర్, కల్వకుర్తి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్‌యాదవ్, కేఎస్ రత్నం తదితరులు హాజరై ఉత్సవాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ యాదవ సోదరులు ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా దున్నపోతుల విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, మండలంలోని వివిధ గ్రామాల యాదవులు తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.